తనకు ప్రధానికుండవలసిన కార్యనిర్వహణ సామర్థ్యం లోపించిందని మాలెంకోవ్ ఒప్పుకున్నాడు. సోవియెట్ వ్యవసాయంలో తీవ్రమైన లోపాలు జరగడానికి తన బాధ్యతను అంగీకరించడం ప్రారంభించాడు.

విపరీతమేమంటే, ఇది బెరియా ఉదంతాన్ని తలపునకు తెస్తున్నది. పూర్వం సోవియెట్ రహస్య పోలీసు శాఖకు ముఖ్యుడుగా పనిచేసిన ఆయన అభియోగాలలో ఒకటి — వ్యవసాయాభివృద్ధికి ఆయన విఘాతం కలిగించాడు—అని. ఇప్పుడు అదే అభియోగం మాలెంకోవ్ పైన కూడా తేబడిందని ఆయన స్వయంగా చేసిన ప్రకటన సూచిస్తున్నది. అయినప్పటికీ—ఇప్పటిలాగానే—బెరియా ఏరివేత జరిగినప్పుడు కూడా సోవియెట్ వ్యవసాయోత్పత్తికి బాధ్యుడైన వ్యక్తి నికిటా కృష్చేవ్ మాత్రమే.

కృష్చేవ్ పైకివచ్చినతీరును "వైఫల్యాల విజయ గాథ"గా వర్ణించవచ్చు. యుక్రెయిన్‌లో జాతీయ వాదులను రూపుమాపడానికిగాను ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో ఆయన స్టాలిన్‌చే నియమించబడ్డాడు. ఆ సందర్భంలో ఆయన వేలకొద్దీమందిని చంపాడుకాని, అక్కడి ప్రజలు జర్మన్ బలాలతో సహకరించకుండా చేయలేకపోయాడు. యుద్ధానంతరం యుక్రెయిన్‌లోని వ్యతిరేకవర్గాలవారిని ఏరివేయడానికిగాను ఆయన నియమించబడ్డాడుకాని యుక్రెయిన్ ఈనాటికీ వ్యతిరేకవర్గాలకునిలయంగా వుంటున్నది.

స్టాలిన్ హయాములో 1950నుంచి 1952వరకు కృష్చేవ్ వ్యవసాయ శాఖకు ఆధ్వర్యం వహించాడు. తీవ్రమైన విమర్శకు గురి అయి, ఆ పదవి నుండి తొలగించబడ్డాడు. ఆసందర్భంలో ఆయన ప్రమాదకర పరిస్థితుల నెదుర్కొనవలసి వచ్చేదేకాని, మాలెంకోవ్, లాజార్ కాగనోవిజ్‌లు అడ్డుపడిన కారణంగా రక్షించబడ్డాడు. మళ్ళీ ఇప్పుడొకసారి కృష్చేవ్ తన వ్యవసాయ శాఖా నిర్వహణ విషయంలో విఫలుడయాడు; అయినప్పటికీ సోవియట్ యూనియన్‌లో అత్యున్నత స్థానాన్ని చేరుకున్నాడు.

---

కథానిక

# మణిగారి "వ్యాపారం"

"గోపి"

క్లబ్బులో అందరూ విషాదంగాముఖాలు పెట్టుకొని కూర్చున్నారు. సోమసుందరం విసురుగా వచ్చి, నిశ్శబ్దంగా ఉన్న మిత్రబృందాన్ని చూచి, ప్రకాశంగా—"హా! హా!! పీనుగు పోయినట్లు కూర్చున్నారేం? మణిగారేరి?" అన్నప్రశ్నకి ముఖమేనా తిప్పకుండా వార్తాపత్రికలోపడ్డ ఒక విషయాన్ని చేతితో చూపించారు. వెంకటేశ్వర్లుగారు లంచగొండితనానికిగా అరెస్టు చేయబడ్డట్లు తెలిపిందా వార్త.

"ఇదా మీ బాధ చాల్లెండి, బోయ్! ఆ పేక ఇలా పారేయ్, ఏదన్నా తినడానికి ఉందా!" అని చాలా తెలివిగా అనేసి జేబులోంచి సిగరెట్ తీసి ముట్టించి పడక కుర్చీలో కూర్చొని ప్రశాంతంగా పొగ వదలడం మొదలు పెట్టేడు.

"నీ కేమీ చీమకుట్టినట్లుగా లేదే!" అని అడిగాడు వేదులు.

"ఊహూ" ప్రభుత్వం లంచగొండితనాన్ని నిర్మూలించాలంటే ఒక్క వెంకటేశ్వర్లు గారిని పట్టుకుంటే పోయిందా? ఈ చీడపురుగు, సంఘంలో పాతుకుపోడానికి మూలకారణాలు ఎన్నెన్నున్నాయో, అన్నీ నిర్మూలించాలి. కనీసం కత్తిమీద గెలుద్దాం అన్నా అందర్నీ ముందు జైల్లో పెట్టేసి తరువాత "నిర్దోషులం" అని ఋజువు చేసుకున్నవాళ్ళని మాత్రం వదిలేయాలి. బహుశా మనం జైళ్ళల్లోకూడా Easy Money Cult ని స్థాపించగలమేమో!" ఈ చివరిమాట అందర్నీ చాలా ఉత్సాహపర్చింది. ఈ మాత్రందానికి ఎందుకింత బాధపడ్డామా అని చాలా కించపడ్డారంతా.

సోమసుందరం బహుకాలానికి మొదటి సారిగా ముఖం ముడిచి ఆలోచించ సాగాడు. ఒత్తుగా వస్తూన్న సిగరెట్ పొగ అవతల కొన్ని కొన్ని చిత్రాలు కనబడడం మొదలుపెట్టాయి.

*     *     *

"ఏమిటమ్మా నీ హడావుడి?"

"హడావుడి కాదురా మరి! శుభమా అని అని పండంటి మొగపిల్లాడు పుడితే!"

"ఊరుకుందూ! ఒకళ్ళూ ఇద్దరూ ఐతే వేడుక ఐదూ ఆరూ ఐతే ఏం వేడుక?"

"అది మరీ బాగుందిరా! శుభమా అని మగ పిల్లాడు పుడితే!"

"నాకిచ్చే జీతంలో ఇద్దరిపెళ్ళి ముగ్గురు చదువు కూడానా——"

"రామరామ ఏంమాటలురా అవి. నారుపోసిన వాడు నీరుపోయడురా?"

"ఇన్ని వేదాంతా లెందుకూ లక్ష్మికో మొగుణ్ణి చూచి పెడుదూ! ఇప్పుడథమం ఒక ఐదువేలన్నా ఉంటేగాని కాదాయె. తెలీక అడుతాను నీ పెళ్ళి కెంత ఖర్చయిందే!"

"అప్పుడు ఖర్చులుకూడానా! నాలుగువందలు పెడితే నాకూ రత్తికీ కూడా పుస్తెముళ్ళు పడ్డాయి."

"నా చదువుకో?"

"అప్పుడు ఖర్చెందుకురా! ఇంట్లో భోజనం స్కూలుకి అర్థజీతం, ఇంతకీ ఎం. ఏ. బి. ఏ లు చెప్పించాం కాబట్టా?"

"సరా! ఇప్పటికీ అప్పటికీ ఎంత భేదమో! మీ అమ్మకి నువ్వు పదకొండో సంతానం, మీ తాతకి ఇరవైమంది పిల్లలూ! ఐతే అప్పటికీ ఇప్పటికీ ఒకటేనా? నే మెట్రిక్ పాసై ఇప్పుడు రెండొందలు తెచ్చుకుంటున్నా. ఇప్పుడు ఉద్యోగం కావాలంటే పైసా, ప్రాపకం రెండూ ఉండి, అథమం ఒక బి. ఏ. ఐనా ప్యాసైతేకాని లాభం లేదాయె. ఏం?"

*     *     *

"ఏరా! బాలసారె అక్కరలేదన్నావుట!"

"ఔను."

"శాంతికూడావుందిరా! పీటలమీద కూర్చొని, కాస్త నాలుగు దానాలూ ఇచ్చేస్తే పోయేదానికి ఏం బ్రహ్మాండం చేస్తావురా!"

"పైసాలుండద్దూ"

"ఎంతుంటే అంత. మానేస్తామా!"

"మొన్న పురిటికెంతయిందో తెలుసా?"

"అవదూ! పురుడూ పుణ్యం ఖర్చులేకుండా ఔతుందా?"

"సరేలే"

*     *     *

"ఏమండీ!"

"ఏం?"

"ఆడబొట్టెకి, అన్నగార్కి, చీర, పంచల చాపు పెట్టకపోతే బాగుండదండీ, అనుకోకుండా బాల సారకి వచ్చారు చాలా కాలానికి."

"సరే!"

*     *     *

"నాన్నా!" ఇంగ్లీషు, తెలుగు, లెఖ్ఖలు మూడూ మారిపోయాయి. క్రొత్తవి కావాలి" అన్న పెద్దబ్బాయి రామంతో——

"మొన్న నేవో కొన్నావు?"

"అవి కాంపోజిషన్‌కి, కాపీలకి, జామెట్రీకి."

"అచ్చులేకదూ!"

"అవునా నాన్నా ఒకపక్క తెల్లకాయితాలు రెండోప్రక్క అచ్చు..."

"ఇంకా ఎన్ని కావాల్రా?"

"డ్రాయింగుకి కలర్సు, అట్లాసు, కంపస్ బాక్సు..."

"చాల్రా చాలు. సాయంకాలం జ్ఞాపకం చెయ్యి"

"నాన్నా! నా పుస్తకాలో" అడిగిన క్రిష్టకి,

"నీ కెన్ని కావాల్రా...? సర్లే, రామంతో పాట బజారుకిరా సాయంకాలం..."

*     *     *

"ఏమండోయ్, గవర్నమెంటు డాక్టరు మంచి నీళ్ళు పోస్తున్నాదండీ!"

"ఏం చెయ్యమంటావే!"

"ఇంటిదగ్గర, చూడండీ ఓసారి, రోగీ రోగని వారిణీ అన్నారు పెద్దలు"

"నాదగ్గర కాణీలేదు."

"చూచూస్తు చేతులారా చంపేసుకుంటామండీ, చంటిది అంతగా దగ్గుతో బాధపడుతూంటే!"

* * *

"ఏం లక్ష్మీ అలా చూస్తున్నావ్!"

"నాన్నా మరేనే, సుబ్బమ్మ పిన్నివాళ్ళూ సినిమా కెళుతున్నారు!"

"పేపర్లో రాలేదే!"

"పేపర్లో ఎందుకూ?"

"సుబ్బమ్మ పిన్ని సినిమా కెళితే పేపర్లో పడొద్దే!"

"అక్కా నాన్నగారు హాస్యమాడుతున్నారే!" అని అందించింది రత్నం.

"లేదే! చూడూ, నెహ్రూగారు సినిమాకెళితే పడలేదూ?"

"లేదునాన్నా...!"

"అయ్యో! వెళ్ళటంలేదూ?"

"వెళుతున్నారు నాన్నా! నేనూ చెల్లీకూడా వెడతాం నాన్నా!"

"అదో మహాభాగ్యమా! వెళ్ళండి!"

"డబ్బో?"

"ఎక్కడిది?"

అవాళ లక్ష్మీ రత్నం రాగంపెట్టి సాధించారు డబ్బులు.

* * *

"దీపావళికి పటాకీలకి మారాం పెడుతున్నారండి."

* * *

అమ్మాయికి 15 వెళుతున్నాయి. నాకదో గుండెల్లో కుంపటిగా ఉంది... మీ కెల్లా నిద్దరపడుతున్నాదో!

* * *

"అబ్బాయికి ఈ సంవత్సరం ఓ.నూలు పోగు వేద్దామంటే, అమ్మాయికి ఏమీ కలిసిరాకుండా వున్నాయి."

"ఒరే! చూడూ నే బ్రతికినన్నాళ్లు బ్రతకనురా. ఒకసారి గంగలో ముంచేసి తీసుకురావూ?"

* * *

ఇలాగ ఎటుచూచినా, పండుగలు పబ్బాలు, వేడుకలు, పురుళ్ళు పుణ్యాలువచ్చి ఐదవసంతానం కలగడం, సోమసుందరాన్ని చిత్తుచేశాయి. ఆదర్శప్రాయమైన జీవితంకోసం ఎంతగా ప్రయత్నం చేశాడో అంతగా దెబ్బతింటున్నాడు. ఎక్కడా క్లుప్తంగా వచ్చినదాంతో కాలక్షేపం చేద్దామంటే వీలు కనబడలేదు. మధ్యతరగతి ప్రజకి మరో గొడ్డలిపెట్టు, తండ్రినాటి నాలుగెకరాల ఇనాం, క్రొత్తసంస్కరణలలో ఆవిరైంది. ఈ నాలుగెకరాలమీద లక్ష్మీరత్నాలపెళ్ళి చేద్దామని అనుకుంటూంటే ఇలాగైపోయింది. అప్పటికీ ఏదోలా నాలుగురాళ్ళు పోగుచేసి లక్ష్మిపెళ్ళి రామం వడుగు ఐందనిపించాడు. పుస్తె మూడుముళ్ళూ పడ్డాక తెలిసింది వరుడు ఒక విజాతి కన్యని గాంధర్వ వివాహం చేసుకొన్నాడని, ఒక కుమారుడు కూడా ఉన్నాడని. సోమసుందరానికి ఒక విషయం పూర్తిగా తెలియవచ్చింది. "అన్యాయానికి పోతేగాని ఆదాయం పెరగదు. ఆదాయం పెరిగితేకాని,అర్థంలేని ఆచారాలు ముద్దులు ముచ్చటలు, వ్రతాలు, భేషజాలు, మందులు మాకులు, చదువులు, పెళ్ళిళ్ళు చెయ్యలేము. డబ్బు కుమ్మరిస్తేనేకాని ఏ పనీ కాదు... రామం స్కూలు ఫైనల్ ప్యాసయ్యాడన్న వార్త విషాదాంతంగా అనిపించింది. కాలేజీకి పంపించాలి. అంటే అదో మురికినాళంలో పన్నీరు. తీరా బాగా పాసైనా, ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ ఏమన్నా ఉందా? రోజుకురోజూ పెరుగుతూన్న నిరుద్యోగపు కొలువులో చివరమెట్టుమీద నిరీక్షకి అధికారంవస్తుంది. పేసైతే! లేకపోతే అదీలేదు...

"ఇంట్లోవాళ్ళకి తన ఆదాయం, వ్యయం తెలీదా? లేక తెలిసీ అది వాళ్ళకేమీ సంబంధం లేదు అనుకుంటూరా? నేను అకస్మాత్తుగా 'హరీ' మంటే ఎలాగ ఈ ఖర్చులు నడిపిస్తారు?—అని చాలాసార్లు ఆలోచించాడు. కాని దీనికీ జవాబు రాలేదు. తనో రెండ్రోజులు కాఫీ, సిగరెట్ అన్నీ, మానేసి, ఇంట్లో ఆదర్శాలగూర్చి, ఏకానమీ గూర్చి లెక్చరు చెప్పాడు.

"పోనిస్తురూ! మీ వెర్రికాకపోతే! అందరూ మీలాగుండొద్దూ? మీరొక్కరూ మడికట్టుకుంటే సరా? మీరొక్కరు కాఫీ,సిగరెట్లు మానేస్తేమళ్ళా, ఒంటికొస్తే డాక్టరుకివ్వొద్దూ?"అని ఈసడించింది శ్రీమతి. సుడిగుండంలా ఉన్న ఆర్థిక పరిస్థితిని తనా

క్కడే తప్పకురావాలి! ఎవ్వరూ ఎవ్విధంగానూ సహాయపడరు. ఈ విషయం పదేపదే తోచింది సోమసుందరానికి. మధ్యతరగతిలో మరో జబ్బేమంటే, తిన్నదీ, కొన్నదీ మొదటిరకం కావాలి. ఆరోగ్యానికి భంగమనో, వేగిరం పోతుందనో, ఎవరన్నా చూస్తే నవ్వుతారనో, ఒకరికిచ్చేటప్పుడు లోభం చూపించకూడదనో... ఏదో సాకు ఉండనే ఉంటుంది.

సోమసుందరానికి ముప్ఫయితొమ్మిదివెళ్ళి నలభై వచ్చాయి. రెండుశేర్ల పాలు అదనంగా తెప్పించి క్షీరాన్నం గారెలు చేయించారు. రాత్రి శ్రీమతిని అడిగాడు, "నాకెంత అప్పుందో తెలుసా?"అని. "పోనిస్తురూ ఎప్పుడూ ధరలిలాగే కాలిపోతాయా, తీర్చేస్తాం. పుట్టినదినం పూటా అవన్నీ మరి కెలక్కండీ"అని తాళంవేసింది. శుద్ధ 'ఎస్కేపిజం' అని సోమసుందరానికి తెలిసీ ఏమీ అనలేకపోయాడు.

మర్నాడు చాలా ఆకలిగా ఉంటే క్లబ్బుకి వెళ్ళాడు. టీకి ఆర్డరిచ్చి, దానితోపాటు నాలుగూ తిన్నాడు తృప్తిగా. బిల్లువస్తుందని తోచేవరకూ ఇది బాగానే ఉంది. కాని దగ్గరదగ్గర రూపాయి బిల్లు తలుచుకోగానే గుండెఝల్లుమంది. కుంద్రంగా పొట్ట, జలతారు కండువా పుష్టిగాఉన్న ఒక ఆగంతుకుడు అదేపనిగావచ్చి ప్రక్కని కూర్చున్నాడు.

"తమరెప్పుడూ క్లబ్బుకు రారే!"అన్నాడు.

"ఇవాళ వచ్చేనుగా!"అన్నాడు సోమసుందరం విసురుగా.

"చిత్తం చిత్తం" అంటూ కాఫీ పుచ్చుకొని, బిల్లు పేచేసి వెళ్ళిపోయాడు. తన బిల్లుకోసం అడిగితే "మణిగారిచ్చి వెళ్ళరండీ" అని చెప్పాడు. మొదట బళ్ళు మండినా, తరువాత జేబులో అంత డబ్బులేదని తెలిసి చల్లబడింది.

మళ్ళా ఆదివారం మణిగారు ఇంటికి వచ్చేవరకూ, అలాంటి వాడొకడున్నాడని మరిచిపోయాడు. మణిగారు, చాలా దయార్ద్రహృదయులు అనిపించేట్టు కష్టసుఖాలు మాట్లాడారు. ఇష్టం లేక పోయినా సోమసుందరం తన కష్టసుఖాలని చెప్పుకోకుండా ఉండలేక పోయాడు. ఎవ్వరూ చూపించని సానుభూతి మణిగారు చూపించడంతోనే సోమసుందరం—

"తమరేం చేస్తూంటా"రని అడిగాడు.

"పెద్దల సహచర్యం" అన్నాడు నవ్వుతూ.

"అంటే?" అన్నాడు తెల్లబోయి.

"మీలాంటి వాళ్ళని కష్టాల్లోంచి తొలగించడంలో ముట్టే తృణమో పణమో మిగిల్తే, ఈ జీవయాత్ర సాగిస్తూంటాను"అన్నాడు వ్యంగ్యంగా. సోమసుందరానికి కొంచెం కొంచెం అర్థమైంది. మణిగారు విపులంగా చెప్పారు. సోమసుందరంగారి నిజాయితీ, మంచితనం చూచి, వారి క్రిందివారు చాలా దోచుకుంటున్నారని, ఒక్క సోమసుందరంగారి 'నిజాయితీ' వల్ల ఏమీ ప్రపంచం బాగుపడటం లేదని. సరే కొంతవరకూ వాదాలు జరిగినా మణిగారి విధానం చాలా సంతృప్తి కరంగా కనబడింది. స్వయంగా సోమసుందరంగారు ఏమీ చెయ్యక్కరలేదు. అంతా మణిగారే చూచుకుంటారు. మణిగారికి చాలామందితో ములాఖత్తుంది. ఏమీ చిక్కులేదు. ఇంట్లో ఏ చిక్కూ లేకుండా పోతుంది.

నైతిక పథంలో ఆఖరు సోపానం అవాళదిగిపోయాడు సోమసుందరం. మళ్ళా ఎక్కడానికి ప్రయత్నం చెయ్యలేదు. నలుగురుతో కలిసిమెలిసి ఉండటానికి, పేకాట, మొదలైన వ్యసనాలు బాగా అభ్యాసమయ్యాయి. ఇంట్లో ఇబ్బందేలేదు. రామాన్ని కాలేజీకి పంపించాడు. అమ్మాయిలకి కూడా ఇంటిదగ్గర ట్యూషన్. అంతా "సోమసుందరంగారు అదృష్టవంతులమ్మా" అనేవాళ్ళే! "ఇంట్లో కూడా ఎల్లా వస్తూందీ డబ్బు అని అడగలేదు...అప్పుడప్పుడు రాత్రుళ్లు కూడా. ఇంటికి రాకుండా క్లబ్బుల్లోనే గడిపేసిన దినాల్లో మట్టుకు ఇంట్లో గాభరా పడేవారు. ఇప్పుడదీ అలవాటైపోయింది...

తన జీవిత చిత్రంలో తనొక్కడే నాయకుడుగా ఉండి నడిపించిన నాటిముచ్చటలు, సోమసుందరం చాయగా చూచి చిరునవ్వు నవ్వేడు. పేకవచ్చింది "ఏదో ఒకటి ఔతుంది! ఖయ్యాం మనం ఇలా కూర్చోడం సహించలేదు. రండి, ఎవరి రోజు ఎప్పుడో తప్పదు. ఇంతకీ మణిగారు ఉన్నారుగా చూచుకుంటారు లెండి." అని తన మతాని ధైర్యపరచి, ఆటలో దిగిపోయాడు సోమసుందరం.

★